నీట్‌తో తెలంగాణకు నష్టం

- వైద్యవిద్య ప్రవేశాలు రాష్ట్రాలకే అప్పగించాలి
- లీకేజీలో కోట్లు చేతులు మారాయి
- ఈడీ విచారణ ఎందుకు చేయలేదు?
- నీట్ పరీక్షను రద్దు చేయాలి
- కౌన్సెలింగ్ నిలిపివేయాలి
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, చిత్రంలో మాజీ మంత్రి కొప్పుల, రూప్‌సింగ్, మన్నెగోవర్ధన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): వైద్యవిద్యలో నీట్ పరీక్ష వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతున్నదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. నీట్ వల్ల తెలంగాణతోపాటు చాలా రాష్ట్రాలు నష్టపోతున్నాయని, వైద్యవిద్య ప్రవేశాలను ఆయా రాష్ట్రాలకే అప్పగించాలని డిమాండ్ చేశారు. బీహార్, గుజరాత్ రాష్ట్రాల నుంచి నీట్ ప్రశ్నపత్రం లీకై, కోట్ల రూపాయలు చేతులు మారినట్టు ఆరోపణలు వస్తుంటే ఈడీ ఎందుకు కేసు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. మంగళవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లోని మెడికల్ పీజీ సీట్లలో 50% సీట్లు 'ఆల్ ఇండియా' కోటా కిందకి వస్తాయని, దీంతో మన రాష్ట్ర వైద్య విద్యార్థులు 621 సీట్లు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ కాలేజీల్లోని ఎంబీబీఎస్ సీట్లలో 15% ఆల్ ఇండియా కోటాలోకి వెళ్లడం వల్ల మన రాష్ట్ర విద్యార్థులు 519 సీట్లు కోల్పోతున్నారని చెప్పారు. తెలంగాణలో ఎక్కువ ప్రభుత్వ కాలేజీలు ఉండటం వల్ల ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆల్ ఇండియా కోటా కింద ఎక్కువ సీట్లను మన విద్యార్థులు కోల్పోతున్నారని వివరించారు. ప్రభుత్వ కళాశాలను మాత్రమే ఆల్ ఇండియా కోటా పరిధిలోకి తేవడం వల్ల ఎక్కువ నష్టం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఒక్కసారి తెలంగాణలో ఎంబీబీఎస్‌లో చేరితే, వారు పీజీ చేసేందుకు స్థానికులుగా అర్హత సాధిస్తున్నారని తెలిపారు. కానీ, తెలంగాణ విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చదివితే, అక్కడ నాన్ లోకల్‌గా, ఇక్కడ కూడా నాన్‌లోకల్‌గా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో మన వైద్య విద్యార్థులు ఎంబీబీఎస్‌తోనే చదువుకు ఫుల్‌స్టాప్ పెడుతున్నారని పేర్కొన్నారు.

పరీక్ష నిర్వహణలో ప్రభుత్వాలు విఫలం

నీట్‌లో ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం బయటపడటంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు, అనుమానాలు వెల్లువెత్తుతున్నాయని, ఈసారి ఏకంగా 67 మంది టాపర్లుగా నిలవడమే అనుమానాలను బలపరుస్తున్నదని వినోద్‌కుమార్ చెప్పారు. కొన్నిచోట్ల ఇంగ్లిష్ పేపర్‌కు బదులు హిందీ పేపర్ ఇచ్చినట్టుగా ఆరోపణలు వస్తున్నాయని, తెలంగాణలోని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో దేశంలో అందరికీ ఇచ్చిన పేపర్ కాకుండా వేరే ప్రశ్నాపత్రం ఇచ్చినట్టు వార్తలు వచ్చాయని తెలిపారు. ఇది నిజంగా దారుణమని, పరీక్ష నిర్వహణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఆలస్యంగా ప్రశ్నపత్రాలు ఇవ్వడం వల్ల కొంతమందికి గ్రేస్ మార్కులు కలిపామని, దానివల్ల 718, 719 మార్కులు వచ్చాయని ఎన్టీఏ డైరెక్టర్ చెప్పడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. కోర్టులో కేసు వేయగానే గ్రేస్ మార్కులను తీసేశారని, అసలు గ్రేస్ మార్కులు ఏ లెక్కన కలిపారు? ఎందుకు కలిపారు? ఎంతమందికి కలిపారు? అనేది ఇప్పటికీ ప్రశ్నగానే ఉన్నదని మండిపడ్డారు. ఒకవైపు నీట్‌లో తప్పులు జరిగాయని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ చెప్తుండగా పరీక్షను రద్దు చేయకుండా కౌన్సెలింగ్ నిర్వహించడంలో అర్థం ఏమిటని నిలదీశారు. ఇంత జరుగుతున్నా వైద్యవిద్యను పర్యవేక్షించే కేంద్ర వైద్యశాఖ మంత్రి స్పందించకపోవడం విడ్డూరమన్నారు.

ముందే ఎందుకు విడుదల చేశారు?

నీట్ ఫలితాలు జూన్ 14న విడుదల చేస్తామని మొదట ఎన్టీఏ ప్రకటించిందని, కానీ, దేశంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదలైన జూన్ 4న హడావుడిగా ఎవరికీ తెలియకుండా విడుదల చేశారని వినోద్‌కుమార్ పేర్కొన్నారు. తప్పులు జరిగాయి కాబట్టే ఆ రోజు ఎవరూ పట్టించుకోరని ఫలితాలను విడుదల చేశారనే అనుమానాన్ని వ్యక్తంచేశారు. 'పరీక్షా పే చర్చ' అంటూ హడావుడి చేసే ప్రధాని మోదీ ఇప్పుడు కనీసం స్పందించడం లేదని విమర్శించారు. నాడు టీఎస్‌పీఎస్సీ లీకులపై గాయి గత్తర చేసిన బీజేపీ నాయకులకు ఇప్పుడు నీట్ వ్యవహారం కనిపించడం లేదా? నీట్‌లో ఉత్తరాది వాళ్లకే ఎందుకు ఎక్కువ సీట్లు వస్తున్నాయి? వాళ్ల లబ్ధి కోసమే నీట్‌ను నిర్వహిస్తున్నారా? అని ప్రశ్నించారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని లక్షలాది విద్యార్థులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. కౌన్సెలింగ్ అయిపోయిన తర్వాత చేసేదేమీ ఉండదని, ఇప్పుడే ఈ పరీక్షను రద్దు చేసి, మళ్లీ పరీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, పార్టీ సీనియర్ నాయకుడు మన్నె గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రానికి బీఆర్ఎస్ నాయకత్వం అవసరం

- రుణమాఫీ అందరికి వర్తింపజేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

యాదగిరిగుట్ట, జూన్ 18 : రాష్ట్రానికి బీఆర్ఎస్ నాయకత్వం ఎంతో అవసరమని, ఆ పార్టీ ఎప్పటికీ ఉండాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సూచించారు. ఆ దిశగా మాజీ సీఎం కేసీఆర్ కృషి చేయాలని కోరారు. మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌ను చంపి బీజేపీని బతికిస్తే మంచిది కాదని అన్నారు. ఐటీ చెల్లించే వారికి కూడా రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రభుత్వంలో భాగమైనా ఉద్యమాలు, పోరాటాలు ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ 8 ఎంపీ సీట్లు గెలువడం దురదృష్టకరమని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సిద్ధాంతాలను మరిచాయని, ఇతర పార్టీల నాయకులను చేర్చుకొని అధికారంలోకి వచ్చాయని విమర్శించారు. బీజేపీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, ఈటల రాజేందర్‌కు కమలం పార్టీతో సంబంధం లేదని, ఆ పార్టీలో ఎంపీ కిషన్‌రెడ్డి మినహా ఎవ్వరూ బీజేపీకి చెందిన వారు కాదని చెప్పారు. టీడీపీ నుంచి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వచ్చారని, ఆయనతోపాటు చాలామంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారేనని గుర్తుచేశారు. బీజేపీ, కాంగ్రెస్ మాదిరిగా అధికార దాహంతో సీపీఐ ఉండబోదని అన్నారు.

'కిసాన్ సమ్మాన్ నిధి'లో రసాభాస

- కేసీఆర్ పథకాలపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రసంగం
- కేంద్రమంత్రి సాక్షిగా అడ్డుకున్న బీజేపీ నాయకులు

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రసంగాన్ని అడ్డుకుంటున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట, జూన్18: కరీంనగర్ జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన 'కిసాన్ సమ్మాన్ నిధి' కార్యక్రమం రసాభాసగా మారింది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన నిధుల విడుదల ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కేవీకే సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా కేంద్ర జల్‌శక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి వీ సోమన్న, మరో అతిథిగా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన పథకాలను వివరించే క్రమంలో బీజేపీ నాయకులు అత్యుత్సాహం చూపారు. వీరితో కొందరు కాంగ్రెస్ నాయకులు జత కలిసిపోయారు. ఎమ్మెల్యే అతిథనే విషయాన్నే మరిచిపోయారు. ప్రొటోకాల్‌ను విస్మరించి ప్రసంగాన్ని అడ్డుకున్నారు. తెలంగాణ పథకాలతోపాటు, కిసాన్ సమ్మాన్ నిధి పథకంపై కూడా మాట్లాడుతానని చెప్పి ప్రసంగాన్ని కొనసాగించారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని చెప్పారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల విద్యుత్తు, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అందిస్తున్న సాగునీటి విషయాన్ని చెప్తున్న క్రమంలో ఒక్కసారిగా బీజేపీ నాయకులు లేచి అడ్డుకున్నారు. కేసీఆర్ పేరును ప్రస్తావించొద్దని లొల్లి చేశారు. గొడవ చేయొద్దు' అని కేవీకే నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. పోలీసులు అడ్డుకున్నా.. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో నాయకులంతా సంయమనం పాటించాలని కేంద్రమంత్రి సోమన్న విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి సోమన్న మాట్లాడారు.

రాజ్‌భవన్ ఎదుట బైఠాయించిన బీఆర్ఎస్వీ నేతలు గెల్లు, తుంగబాలు తదితరులు

నీట్‌ను రద్దు చేయాలి

- మోదీ మా అవకాశాలను మీ స్వార్థం కోసం అమ్ముకుంటారా?
- 24 లక్షల మంది విద్యార్థుల ఉసురు తగులుద్ది
- నీట్‌కు వ్యతిరేకంగా గొంతెత్తిన విద్యార్థిలోకం
- బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ముట్టడి ఉద్రిక్తం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): 'ప్రధాని మోదీ పదవి నుంచి దిగిపో.. తప్పు ఒప్పుకొని బహిరంగ క్షమాపణ చెప్పు.. మీ స్వార్థం, మీ లాభం కోసం మా అవకాశాలను అమ్ముకునే హక్కు మీకెవరిచ్చారు? 24 లక్షల మంది విద్యార్థుల ఉసురు తగులుద్ది.. దేశవ్యాప్తంగా నీట్ అవకతవకలపై పెద్ద ఎత్తున నిరసన జరుగుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మౌనంగా ఉండటం సిగ్గుచేటు. ప్రతి విద్యార్థి కన్నీటి చుక్కకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాధానం చెప్పాలి. నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలి' అని విద్యార్థి నేతలు ధ్వజమెత్తారు. నీట్ అవకతవకలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మంగళవారం హైదరాబాద్ నగరంలో విద్యార్థిలోకం కదం తొక్కింది. రాజ్‌భవన్ ముట్టడి, స్టూడెంట్ మార్చ్‌తో నగరం అట్టుడికింది. బీఆర్ఎస్వీ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, విద్యార్థి జనసమితి, డీవైఎఫ్ఐ, పీవైఎల్, ఆమ్‌ఆద్మీ పార్టీ తదితర 12 విద్యార్థి, యువజన విభాగాలు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఇతర నేతలు మాట్లాడుతూ నీట్ అవకతవకలపై విరుచుకుపడ్డారు. 3.5 కోట్ల జనాభా ఉన్న తెలంగాణలో 8,850 సీట్లు ఉన్నాయని, 25 కోట్ల జనాభా ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లో 9,500 సీట్లున్నాయని, తద్వారా ఎక్కువ సీట్లు ఉత్తర భారతదేశానికే పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న హైదరాబాద్‌కు ఒక్క ర్యాంకు కూడా రాకపోవడం విచారకరమని పేర్కొన్నారు. నీట్ నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దక్షిణాదిపై వివక్ష చూపుతున్నదని, 150 వైద్య కళాశాలలు కేటాయించగా, అందులో ఒక్కటి కూడా తెలంగాణకు ఇవ్వకపోవడంతోనే వివక్ష వెలుగుచూసిందని తెలిపారు. నీట్‌ను ఇప్పటికే తమిళనాడు వ్యతిరేకించిందని, సీఎం రేవంత్ పట్టించుకోవడ మే లేదని, వెంటనే క్యాబినెట్ తీర్మానం చేసి నీట్ నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశా రు. ఈ వ్యవహారంలో బీజేపీ నేతల హస్తం ఉన్నదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో తుంగబాలు, బీఆర్ఎస్వీ నాయకులు జంగయ్య, కే నితీశ్, విశాల్, లోకేశ్, శ్యామ్, రాహుల్, వంశీ పాల్గొన్నారు.

అట్టుడికిన నగరం

బీఆర్ఎస్వీ, వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నీట్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలు, ర్యాలీలతో హైదరాబాద్ అట్టుడికింది. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో జరిగిన రాజ్‌భవన్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు రాజ్‌భవన్ గేట్లు ఎక్కేందుకు యత్నించారు. పెద్ద సంఖ్యలో రోడ్డుపై బైఠాయించి కేంద్రం వైఖరిని, రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని ఎండగట్టారు. పోలీసులు పలువురిని అరెస్టు చేశారు. విద్యార్థులు పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నినాదాలతో హోరెత్తించారు. నారాయణగూడ నుంచి లిబర్టీ వరకు ర్యాలీ తీశారు. పీఎం డౌన్‌డౌన్.. సీఎం డౌన్ డౌన్ అన్న నినాదాలు మిన్నంటాయి.

విచారణ జరపాలి: పీడీఎస్‌ఎఫ్

నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (పీడీఎస్‌ఎఫ్) రాష్ట్ర నాయకులు నాగరాజు, కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

తెలంగాణభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

విభజన సమస్యలపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి: శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): రాజకీయాలు ముఖ్యం కాదని, రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కొందరి ప్రయోజనాల కోసం అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. 9, 10 షెడ్యూల్‌లో ఇంకా పరిష్కారం సమస్యలు ఉన్నాయని గుర్తుచేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటే నీళ్లు, నీధులు, నియామకాల కోసం జరిగిందని చెప్తూ.. పదేండ్లయినా ఇంకా కొన్ని అంశాలు పరిష్కారం కాలేవని తెలిపారు. 9వ షెడ్యూల్‌లో 92 కార్పొరేషన్లు ఉన్నాయని, వీటి కోసం కేంద్ర ప్రభుత్వం షీలాబేడీ కమిటీ వేసిందని, కానీ ఆర్టీసీ లాంటి 30 సంస్థల విభజన ఇంకా కొలిక్కి రాలేదని వెల్లడించారు. పదేండ్లయినా ఆ కమిటీ కాలయాపన చేసిందని విమర్శించారు. ప్రభుత్వం మిగిలిన అన్ని సంస్థలపై దృష్టిపెట్టి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. 10 షెడ్యుల్‌లో 102 సంస్థలు ఉన్నాయని, వాటిలో అనేకం పరిష్కారం కాకుండా మిగిలిపోయాయన్నారు. రాష్ట్రాలు విడిపోయాక హైదరాబాద్ నుంచి ఆంధ్రా ప్రజలను వెళ్లగొడుతారని ప్రచారం చేశారని, కానీ కేసీఆర్ పాలనలో వారిని చక్కగా చూసుకొన్నామని తెలిపారు. ఉమ్మడి రాజధాని భవనాలు స్వాధీనం చేసుకోవాలని, ఉద్యోగుల విభజన పూర్తి చేయాలని ప్రభుత్వానికి సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మె ల్యే రేగా కాంతారావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి పాల్గొన్నారు.

బస్ భవన్‌లో చర్చకు రెడీ

- ఐటీఐఎం టెండర్లను బయటపెట్టండి
- పొన్నం మౌనంపై అనుమానాలు
- చలో మొబిలిటి సంస్థతో ఆర్టీసీ బేరసారాలు!
- మూడురోజుల్లోనే అధికారుల అధ్యయనమా?
- డాక్యుమెంట్లు చూపకుంటే కోర్టుకెళ్తాం: బీఆర్ఎస్ నేత క్రిశాంక్

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో ఇంటలిజెంట్ టికెట్ ఇష్యూమిషన్ (ఐటీఐఎం) కాంట్రాక్టును చలో మొబిలిటి సంస్థకు దక్కేవిధంగా ఆర్టీసీ అధికారులు వ్యవహరించారని బీఆర్ఎస్ నేత మన్నె క్రిషాంక్ ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో క్రిశాంక్ మాట్లాడుతూ ఐటీఐఎంకు 2022లో టెండర్లు పిలిస్తే ఆరు కంపెనీలు వచ్చాయని, వాటిని 2023లో రద్దు చేశారని తెలిపారు. తిరిగి 2024లో టెండర్లు పిలిస్తే మూడు కంపెనీలు వచ్చాయని, వాటిని ఫిబ్రవరి 29న రద్దు చేశారని చెప్పారు. సేవలు సంతృప్తిగాలేవని టెండరు రద్దు చేశాక అధికారులు మార్చి 4న అదే సంస్థతో రేటుపై సంప్రదింపులు ఎలా చేశారని నిలదీశారు. ఆర్టీసీ అధికారులు చెబుతున్నట్టుగా మూడు రోజుల్లోనే వివిధ రాష్ట్రాల్లో అధికారుల బృందం పర్యటించిందా..? ఏ అధికారులు పర్యటించారో, వారు ఏం అధ్యయనం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మూడు రోజుల్లోనే ఆ సంస్థకు టెండరు ఇవ్వాలనే నిర్ణయానికి ఎలా వచ్చారని ప్రశ్నించారు. ఇందులో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హస్తం ఉందని ఆరోపించారు. ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల ప్రభుత్వంగా మారిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రతినిధి బృందం బస్ భవన్‌కు రావడానికి సిద్ధంగా ఉందని, టెండర్లు, చలో మొబిలిటి సంస్థ సమర్పించిన పత్రాలు, అధికారుల బృందం పర్యటనకు సంబంధించిన డాక్యుమెంట్లను చూపించాలని అధికారులను కోరారు. టెండర్లలో పారదర్శకత పాటించడానికి డాక్యుమెంట్ల చూపించాలని, లేదంటే విచారణ కోసం తాము కోర్టు వెళ్తామని చెప్పారు.


సెక్రటేరియట్ గోడకు వినతిపత్రాన్ని అతికిస్తున్న రాకేశ్‌రెడ్డి

జీవో 46ను వెంటనే రద్దు చేయండి

- సీఎస్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు అనుమతివ్వలేదు
- బయటే గోడకు అతికించాం
- బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): పోలీస్ నియామకాల కోసం తీసుకొచ్చిన జీవో 46ను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సెక్రటేరియట్‌లో సీఎస్ శాంతికుమారిని కలిసి జీవో రద్దుతోపాటు ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, గురుకుల టీచర్ల సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది లోపలికి అనుమతించలేదు. దీంతో సెక్రటేరియట్ గోడకు వినతిపత్రాన్ని అతికించారు. అనంతరం సచివాలయం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ఆయా ప్రజా సమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి 10 రోజుల నుం చి అడుగుతున్నా సీఎస్ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని రాకేశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేనా ప్రజాపాలన? అని నిలదీశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు జీవో 46 బాధితులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ మాటిచ్చిందని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై ముఖం చాటేశారని విమర్శించారు. జీవో రద్దు కోసం నిరుద్యోగులు కాళ్లరిగేలా తిరుగుతున్నా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. జీవో వెనక్కి తీసుకోవాలని లేకుంటే సవరించాలని డిమాండ్ చేశారు.

ఉరేసుకొని ఆటోడ్రైవర్ మృతి

జీడిమెట్ల, జూన్ 18 : చెట్టుకు ఉరేసుకొని ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం ఈ ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం కొల్లూర్‌కు చెందిన ఎరుకల లక్ష్మణ్(34) కొన్నేండ్ల కిందట తన భార్య నాగమణి, ముగ్గురు పిల్లలతో కలిసి నగరానికి వలస వచ్చాడు. పద్మానగర్ ఫేస్-2లో నివాసముంటూ ఆటో నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆస్తి విషయంలో తన అన్నదమ్ములతో మాట్లాడేది ఉందని తన భార్యకు చెప్పి సోమవారం తన స్వగ్రామానికి వెళ్లాడు. సాయంత్రం తన భార్య ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. రాత్రి తన అత్త లక్ష్మమ్మకు ఫోన్‌చేస్తే ఇంకా ఇంటికి రాలేదని, ఎక్కడో ఉండి ఉంటాడని ఉదయాన్నే వస్తాడని కంగారు పడొద్దని చెప్పింది. మంగళవారం ఉదయం జీడిమెట్ల పోలీసులు నాగమణికి ఫోన్‌చేసి కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఒకరు చనిపోయారని తెలపడంతో వెళ్లిచూసి తన భర్త లక్ష్మణ్‌గా గుర్తించింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియకపోవడంతో మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హామీలపై అడిగితే విమర్శలా?

- ప్రజాసమస్యలపై గొంతెత్తితే మాటల దాడులా?
- కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్ ధ్వజం

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న దేవీప్రసాద్, పక్కన వాసుదేవరెడ్డి

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ప్రతిపక్ష నాయకుడిగా మాజీమంత్రి హరీశ్‌రావు ప్రజాసమస్యల గురించి మాట్లాడితే, ఆ అంశాలను పక్కదోవ పట్టించేలా మంత్రి శ్రీధర్‌బాబు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్ విమర్శించారు. హరీశ్‌రావుపై మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. మంగళవారం తెలంగాణభవన్‌లో దేవీప్రసాద్ మాట్లాడుతూ.. హరీశ్‌రావు లేవనెత్తిన డిమాండ్లలో తప్పులుంటే లేవనెత్తాలి గానీ, తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం ఏమిటని విమర్శించారు. అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లకు దేశంలోనే అత్యధిక జీతాలు పెంచింది కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. 'వేరే రాష్ట్రం నుంచి నేర్చుకోవడం ఏమిటి? అని శ్రీధర్‌బాబు అంటున్నారు. అదే చంద్రబాబు పార్టీ కార్యాలయానికి తన సహచర మంత్రి వెళ్లలేదా? గాంధీభవన్‌లో టీడీపీ జెండాలు ఎగరలేదా? ఇవి శ్రీధర్‌బాబుకు నచ్చుతాయా?' అని నిలదీశారు. నిరుద్యోగుల డిమాండ్లపై హరీశ్‌రావు చేసిన సూచనలపై శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించాలని సూచించారు. ఉద్యోగుల డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో 46పై తమ పార్టీ నాయకులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలవాలని పది రోజుల నుంచి ప్రయత్నిస్తుంటే అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని, ఇదేనా ప్రజారంజక పాలన, ప్రజా పాలన? అని ఎద్దేవా చేశారు. 'ఉద్యోగులకు నాలుగు డీఏలు ఇవ్వలేదు. సీపీఎస్‌పై ఇంతవరకు స్పందనలేదు. రిటైర్ అయిన ఉద్యోగులకు రావాల్సిన మొత్తాన్ని ఇవ్వటం లేదు. పీఆర్సీ నివేదికను ఆరు నెలల్లో ఇస్తామన్నారు. దాని గురించి పట్టించుకున్న నాథుడే లేరు' అని విమర్శించారు.

బహిరంగ చర్చకు సిద్ధం: వాసుదేవరెడ్డి

కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. హరీశ్‌రావుపై ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. హరీశ్ లాంటి నిఖార్సయిన ఉద్యమకారుడి గురించి మాట్లాడే స్థాయి వెంకట్‌కు లేదని మండిపడ్డారు. 'చర్చకు హరీశ్‌రావు కాదు.. నేను వస్తా' అని వెంకట్‌కు సవాల్ విసిరారు. ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. నిరుద్యోగులను ఎమ్మెల్సీ వెంకట్ బెదిరిస్తున్నారని.. ఖబర్దార్ వెంకట్, నిరుద్యోగుల జోలికి వస్తే ఊరుకోబోం అని హెచ్చరించారు. వెంకట్ ఇంకా పరిణతి చెందాలని, ఏదీపడితే అది మాట్లాడితే ఊరుకోమని నిప్పులు చెరిగారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ అక్రమ అరెస్టును ఖండిస్తూ ఖమ్మంలోని ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న పార్టీ నాయకులు

దరఖాస్తు చేస్తే అరెస్ట్!

మొదటిపేజీ తరువాయి...

విమర్శించారు. ఎన్నెస్పీ కాలువ నిర్మాణంలో భాగంగా నాటి ప్రభుత్వం కర్నాటి కృష్ణ సొంత భూమిని తీసుకుందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎన్నెస్పీ కాలువ గట్టుపై నివసిస్తున్న అనేక మంది పేదలు ఆ స్థలాల రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, తమ పార్టీ నేత కృష్ణ కూడా 59 జీవో కింద రెగ్యులరైజేషన్ కోసం అధికారులకు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఆ దరఖాస్తును పరిశీలించిన అధికారులు.. కృష్ణ పొజిషన్‌లో లేని కారణంగా ఇప్పటికే తిరస్కరించినట్టు చెప్పారు. అసలు దరఖాస్తు చేసుకోవడమే తప్పంటూ ఆయనను అక్రమంగా అరెస్ట్ చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారని, వారి దరఖాస్తులు తిరస్కరణకు గురైతే ఆ దరఖాస్తులన్నీ అక్రమమేనా? వారందరినీ అరెస్ట్ చేస్తారా? అని ప్రశ్నించారు. 59 జీవో కింద 3 వేలకు పైచిలుకు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని, వారిని కూడా అరెస్టు చేస్తారా? అంటూ నిలదీశారు. కర్నాటి కృష్ణ అరెస్ట్ విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్ కూడా హైదరాబాద్ నుంచి వస్తున్నట్టు తెలిపారు. ఆందోళన చేసిన వారిలో కార్పొరేటర్ బుడిగం శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు దోకుపర్తి సుబ్బారావు, బత్తుల మురళి, బిచ్చాల తిరుమలరావు తదితరులు ఉన్నారు.

కర్నాటి కృష్ణ అరెస్టు తిరస్కరణ

రఘునాథపాలెం, జూన్ 18: ప్రభుత్వ భూమి రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించాడనే ఆరోపణలతో బీఆర్ఎస్ నాయకుడు, కేఎంసీ 41వ డివిజన్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖమ్మం మూడో అదనపు న్యాయస్థానం తప్పుపట్టింది. ముందస్తు నోటీసులు జారీ చేయకుండా అరెస్టు చేసిన విధానం చట్టబద్ధంగా లేదని పోలీసులను కోర్టు మందలించింది. ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్ స్వామి ఫిర్యాదు మేరకు ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీసులు కర్నాటి కృష్ణపై కేసు నమోదు చేశారు. మంగళవారం తెల్లవారుజామున ముందస్తు సమాచారం లేకుండా అరెస్టు చేశారు. ఈ అరెస్టును తప్పుపడుతూ బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు బిచ్చాల తిరుమలరావు, మేకల సుగుణారావు, దిలీప్‌చౌదరి, తన్నీరు లలిత, చింతల వెంకటేశ్వర్లు ఖమ్మం కోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు విచారణ జరిపింది. కర్నాటి కృష్ణ అరెస్టు సరైనది కాదని స్పష్టం చేసింది. సీఆర్‌పీసీ సెక్షన్ 41 కింద నోటీసులు ఇచ్చి కేసు వేయాలని పోలీసులను ఆదేశించింది. కేవలం రాజకీయ కక్షతోనే కర్నాటి కృష్ణను కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేయించేందుకు కుట్ర పన్ని విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు.